

పూర్తి స్థాయి నీటి మట్టానికి ఎల్లంపల్లి

హాజీపూర్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట వద్దగల ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యానికి చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుండడంతో మూడు రోజుల క్రితం 42 గేట్లు ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదిలారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగడంత్లో 10గేట్లు మాత్రమే తెరిచి ఉంచారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 19.7308 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో రూపంలో ఎస్సారెస్పీ నుంచి 49 వేల క్యుసెక్కుల నీరు వరద రూపంలో 37వేల క్యుసెక్కుల నీరు వరద రూపంలో వస్తోంది. 86వేల క్యూసెక్కుల నీటిని పదిగేట్లు ఎత్తి దిగువ గోదావరికి వదు లుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్, తీగల్‌పహాడ్, సీతారాంపల్లి, హౌసింగ్‌బోర్డు కాలనీ, ఆర్ అండ్‌ఆర్‌కాలనీ, సీసీసీటౌన్‌షిప్, అభినవ కాలనీ, పటేల్‌కాలనీ, శ్రీపాద సిటీ, రెడ్డి కాలనీ, ప్రగతినగర్, రిటైర్మెంట్ కాలనీ, రాజీవ్‌నగర్ ఏరియాలలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నూతన భవనాన్ని నిర్మించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలపట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రస్తుత భవన శిథిలావస్థకు చేరిందని వెంటనే నూతన భవనం నిర్మించాలని యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లాకార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. శనివారం డిగ్రీకళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు మణిచరణ్, దీప, నగేష్, వంశీకృష్ణ ఉన్నారు.

క్రికెట్.. కిరికిరి

- అవినీతి, ఆరోపణలు మూటగట్టుకుంటున్న జిల్లా కమిటీ
- నిధుల దుర్వినియోగంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- ఉన్నతాధికారులకు క్రికెట్ సంఘాల ఫిర్యాదు
- సుదీర్ఘకాలంగా పదవుల్లో కొనసాగుతుండడంపై విమర్శలు



డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేస్తున్న క్రికెట్ సంఘాల బాధ్యులు (ఫైల్)

మంచిర్యాల, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ముఖ్యమైనది క్రికెట్ ఆటగా చెప్పవచ్చు. ఇతర ప్రముఖమైన క్రీడలు ఉన్నప్పటికీ యువత క్రికెట్ అంటే అమితంగా ఆసక్తి చూపిస్తుండడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రైమరీ స్కూల్‌స్థాయి నుంచే విద్యార్థులు క్రికెట్‌పై ఆసక్తి కనబరుస్తుండగా యుక్తవయస్సు లోనూ దానిపై మమకారం చూపుతున్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు ఉద్యోగాలు చేసే యువత కూడ క్రికెట్ అంటే ఇష్టపడుతుంటారు. మంచిర్యాల జిల్లాలోనూ ఆ ఆనవాయితీ కొనసాగుతోంది. జిల్లాలో వందలాది మంది క్రికెట్ క్రీడాకారులు ఉన్నారు. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనల వల్ల జిల్లాలో కొంతమేర క్రికెట్ మసకబారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రికెట్ అసోసియేషన్ జిల్లా పదవుల్లో ఉన్నవారి వైఖరి కారణంగా ఈ పరిస్థితి నెలకొందనే చర్చ సాగుతోంది. క్రికెట్‌కు సంబంధించి పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని పేర్కొంటూ ఇటీవల క్రికెట్ సంఘాలనాయకులు పలువురు పోలీసుశాఖతో సహా జిల్లాలోని ఉన్నతాధికారులకు, రాష్ట్ర ఇన్వెస్టిగేషన్ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు చేశారు. దీంతో ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన క్రికెట్ క్రీడలో అవినీతిపై జోరుగా ప్రచారం ఊ పందుకుంది.

సుదీర్ఘకాలంగా పదవుల్లో...

హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు అనుబంధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కమిటీ ఉంది. ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా కోదాటి ప్రదీప్ కొనసాగుతుండగా మంచిర్యాల జిల్లా కోచ్‌గా పోరండ్ల ప్రదీప్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో క్రికెట్‌లో నెట్ ప్రాక్టీసింగ్, క్యాంప్‌లు కూడా నిర్వహిస్తున్నారు. అయితే వారు ఆయా పదవుల్లో దాదాపుగా 25ఏళ్లకు పైగా కొనసాగుతుండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి మూడేళ్లకోసారి కమిటీ సభ్యులను మార్చాల్సి ఉండగా ఏకధాటిగా 25 ఏళ్లుగా కొనసాగుతుండడంపై ఆరోపణలు వెల్లివిరుస్తున్నాయి. జిల్లా క్రికెట్‌ను కనుసన్నల్లో నడిపిస్తూ క్రీడాకారులకు నామ మాత్రంగా మద్దతునిస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా 25 ఏళ్ల కాలంలో క్రీడాకారులు...

(తరువాయి7లో)

జిల్లాలో నెలకొన్న అవినీతిపై విచారణ జరపాలి...



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖలో నెలకొన్న అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరుపాలి. క్రికెట్ ఆటగాళ్లకు నష్టం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పాతికేళ్లుగా పదవులను అంటిపెట్టుకొని ఉండడం వల్ల ప్రతిభగల క్రీడాకా రులకు తీరని అన్యాయం జరుగుతోంది.

- బొలిశెట్టి కిషన్, ఓల్డ్ మంచిర్యాల క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు

దుర్వినియోగం అయిన నిధులను వెనక్కి తెప్పించాలి..



హెచ్‌సీఏను ప్రక్షాళన చేయడంతో పాటు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు బాధ్యతలు అప్పగించాలి. జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో దుర్వినియోగమైన నిధులను తక్షణమే వెనక్కి తెప్పించాలి. హెచ్‌సీఏను అడ్డం పె ట్టుకొని క్రీడాకారుల భవిష్యత్‌ను తొక్కివేయడం సమం జసం కాదు. ప్రతిభగల క్రికెట్ క్రీడాకారులకు అన్యా యం జరిగితే సహించేది లేదు.

- పైడిమల్ల నర్సింహులు, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎలాంటి అవినీతి జరగలేదు...



ప్రస్తుతం చర్చ జరుగుతున్న విధంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కమిటీలో ఎక్కడ కూడా అవినీతి జరిగిన దాఖలాలు లేవు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూనే ఉన్నాం. వివిధ స్థాయిల్లో క్రీడా కారులు పోటీలు పడుతున్నారు. ప్రతిభగల క్రీడాకారు లను అణగదొక్కుతున్నారనే ఆరోపణలు వాస్తవం కాదు. క్రికెట్‌లో మెళకువలు తెలిసినవారు ఖచ్చితంగా పైస్థాయిలో ఆడతారు.

- పోరండ్ల ప్రదీప్, హెచ్‌సీఏ జిల్లా కోచ్

అధికారులు సమన్వయంతో పని చేయాలి



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : అధికారులందరూ సమన్వయంతో వినాయక మండపాల వద్ద, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పనిచేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పోలీసుశాఖ, విద్యుత్‌శాఖ, అగ్నిమాపకశాఖ, మున్సిపల్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పండుగను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకునేలా శానిటేసన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీప్రకాశ్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



చెన్నాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భీమిని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎలాంటి ఆందోళన చెందవద్దని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో శనివారం వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పక్షాన నష్ట పోయిన ప్రతీ ఒక రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు చెన్నాపూర్ రాజారం రోడ్డు మధ్యలో వర్షాలకు తెగిపోయిన వంతెనను పరిశీలించారు. వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగామోహన్, ఏవో యమునాదుర్గ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాధం లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంగర్సు రవీందర్‌రావు, బెల్లంపల్లి యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, కన్నెపల్లి మండల అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాలను పరిశీలించిన ఎమ్మెల్యే

కన్నెపల్లి : మండలంలోని సాలిగాం గ్రామంలో నీట మునిగి ముంపునకు గురైన ప్రాంతాలను, ధ్వంసమైన రహదారులను శనివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పరిశీలించారు. ముంపుకు గురైన బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని తెలిపారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ఒడ్డేటి హన్మంతు, మండలాల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయ పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : వైద్యులు, సిబ్బంది విధులపట్ల సమయపాలన పాటించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శనివారం వందపడకల ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రోగులను వైద్యసేవలు ఏవిధంగా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పలువార్డులు, ల్యాబ్ మందుల నిల్వలను, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులతో మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు రోగులకు అవగాహన కల్పించాలన్నారు. జ్వరపీడితులకు ప్రత్యేక వార్డును కేటాయించాలన్నారు. అవసరమైన మందులను ఎప్పటికప్పుడు అందుబాటులోకి ఉంచుకోవాలని వార్డులను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి కిడ్నీ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరాకు చర్యలు తీసుకోవాలి

అమృత్ 2.వో పనులు వేగవంతంచేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం పట్టణంలో చేపడుతున్న అమృత్ 2.వో పనులను పరిశీలించారు. మిషన్‌భగీరథ ద్వారా నల్లా కనెక్షన్‌ల ద్వారా నివాసాలకు తాగునీరు సక్రమంగా అందించాలని సూచించారు. పథకంలో నిర్మిస్తున్న నీటి ట్యాంక్‌లను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.

అనంతరం రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ రమేశ్, తహసీల్దార్ క్రిష్ణలు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. రా ష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని కలెక్టరేట్ కార్యాలయాల్లో వినతి పత్రంలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దరణికోట వేణుగోపాల్, సూరినేని గం గాధర్ అన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని ఇచ్చిన హామీని గత ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. జీవో 28ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి లక్ష్మణ్, కొంక శ్రీను, అడిచెర్ల సాగర్, రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

చెన్నూరు : ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం డిప్యూటీ తహసీ ల్దార్ సనత్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు కొట్టెనాగ రాజు, తోడెతిరుపి, సాంబయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నేత సురవరం మరణం తీరని లోటు

బెల్లంపల్లి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణం యావత్ భారత దేశ ప్రజలకు, కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. ఆయన మృతికి శనివారం సంతాపాన్ని తెలియజేసి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలులు అర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ శేఖర్, సతీష్, రమేశ్‌లు పాల్గొన్నారు.

- పట్టణంలో శనివారం సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నా యకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర సమితి సభ్యులు వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సయ్య, నాయకులు రాజమౌళి, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ప్రజా నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కర్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర సమితి సభ్యులే మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, మల్లయ్య, కలీందర్‌ఆలీ ఖాన్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సురవరం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఆయన మరణం పార్టీకి, ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దుర్గరాజ్, రాజేశం, రమణ, కొండయ్య, రసూల్, ఆంటోనిదినేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో సురవరరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

గుంతలు తవ్వారు.. వదిలేశారు..

- మంచినీటి పథకాల పనుల్లో జాప్యం...
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

7

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని ప్రభుత్వం వెంటనే నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ సమరభేరి జీపుజాత ముగింపు సభను శనివారం మంచిర్యాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింద న్నారు. విద్యార్థుల సమ స్యలను పట్టించుకునే వారే లేరన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షి ప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులుపై చదువులకు వెళ్లలేకపోతున్నారని, ఫీజులు కట్టక పోతే యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. మంచిర్యాలలో ఇంజనీరింగ్ కళాశాల, బెల్లంపల్లిలో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేయాలని, చెన్నూరులో ఎస్సీ బాలికల, బాలుర హాస్టల్‌లను నిర్మిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, అభినవ్, నాయకులు నిఖిల్, నిక్షిత, సాయివర్షిణి, ప్రదీప్, హర్షవర్ధన్, ప్రతీక్, రాంచరణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

బ్యాంకు స్కామ్‌లో రూ.13.71 కోట్లు స్వాహా

- అసలు సూత్రధారి బ్యాంకు క్యాషియర్
- మరో 9 మంది ప్రమేయం
- ముగిసిన అధికారుల ఆడిట్

చెన్నూరు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌బీఐ 2 బ్యాంకులో క్యాషియర్ మొత్తంగా రూ. 13.71కోట్ల బంగారం, నగదు స్వాహా చేసినట్లు తెలిసింది. బ్యాంక్‌లో జరిగిన స్కామ్‌పై కొనసాగుతున్న ఆడిట్ శనివారం ముగిసింది. బ్యాంకు రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా వెల్లడించిన వివరాలప్రకారం 402మంది ఖాతాదారులకు చెందిన గోల్డ్ లోన్ బంగారం 20 కిలోల 490 గ్రాములు, నగదు రూ. 1,10, 27,617 స్వాహాఅయినట్లు తేలింది. బ్యాంకు క్యాషియర్ రవీందర్ ఈ స్వాహాపర్వానికి సూత్రాధారి కాగా మరో9 మంది ప్రమేయం ఉన్నట్లు తేల్చారు. బ్యాంకులో ప్రైవేటు అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్కాకుల సందీప్‌తోపాటు క్యాషియర్ రవీందర్, మిత్రులు, సన్నిహితులైన కొంగండి దీరేష్, నరిగె సరిత, నరిగె స్వర్ణలత, ఉమ్మల సురేష్, కోదటి రాజశేఖర్, గౌడసుమన్, యేసంపల్లి సాయికిరణ్, మోత్కూరి రమ్య వీరి పేర్లపై ఉన్న అకౌంట్‌లకు ఈ నగదు బదిలీ అయినట్లు తేలింది. మళ్లీ వీరి అకౌంట్‌ల నుంచి 50మంది అకౌంట్‌కు నగదు బదిలీ అయి చివరకు మళ్లీ క్యాషియర్ రవీందర్ అకౌంట్‌కుచేరింది.

అధికారుల వైఫల్యమే కారణం

బ్యాంకులో జరిగిన స్కామ్‌కు సంబంధించి అధికారుల వైఫల్యమేకారణమని తెలుస్తోంది. గత సంవత్సరం అక్టోబరు నుంచి ఈ సంవత్సరం ఆగస్టు 20 వరకు బంగారంతో పాటు నగదు స్వాహా అయినా అధికారులు గుర్తించకపోవడం వారి వైఫల్యమేననే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆడిట్ జరుగుతుండగా గడిచిన 10నెలల కాలంలో రెండుసార్లు ఆడిట్ జరిగినా ఆ సమయంలో అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనే ప్రశ్న తలెత్తుతోంది. 4-6-2025న కిష్టంపేట ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు బ్యాంకులో ఆడిట్ నిర్వహించారు. బంగారంతో పాటు నగదు సరిగ్గానే ఉందని లెక్క తేల్చడం వెనక ఆంతర్యం ఏంటన్నది తెలియడం లేదు. ఇదంతా పథకం ప్రకారం జరిగిందనే అనుమానాలు బయట తలెత్తుతున్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా

పోలీసుల అదుపులో నిందితులు

బ్యాంకు భారీ స్కామ్‌లో అసలు సూత్రధారితో పాటు పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్వాహా అయిన బంగారం ఎక్కడుంది.

అలాగే అకౌంట్‌లకు బదిలీ అయిన నగదు ఎక్కడుందనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఏపిసోడ్‌లో మరో 50మంది ఖాతాదారులు ఉంటారని తెలుస్తుంది. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు సైతం ఉన్నట్లు తెలుస్తుండగా నిందితులను అరెస్టు చేస్తేకానీ ఎవరిఖాతాలోకి ఎంతవెళ్లిందనేది తెలియరాదు.

పది మందిపై పోలీసులకు ఫిర్యాదు

భారీ స్కామ్‌లో కీలక పాత్ర వహించిన క్యాషియర్ నరిగె రవీందర్‌తో పాటు మరో 9మందిపై శనివారం బ్యాంకు అధికారులు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో నిర్వహించిన సమావేశంలో రీజనల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ఖాతాదారులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రతి పైసా, బంగారం, రికవరీ చేస్తామన్నారు. మరోవైపు బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్యాషియర్‌తో పాటు మరో 9మందిపై కేసునమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

విచారణ చేపట్టిన ఏసీపీ

బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో పాటు చెన్నూరు సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్‌ఐలు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి బ్యాంకుకు చేరుకున్న ఏసీపీ అన్ని రికార్డులతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ కొనసాగిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


లింగయ్య(ఫైల్)

హాజీపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ శివారు పెట్రోల్‌బంక్‌లో శనివారం విద్యుదాఘాతంతో ఆవునూరి లింగయ్య(55) మృతి చెందాడు. హాజీపూర్ ఎస్‌ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట మండలం గుళ్లకోట గ్రామానికి చెందిన లింగయ్య దొనబండ శివారు ఎంవీఆర్ గార్డెన్, ఫంక్షన్ హాల్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం ఫంక్షన్ హాల్‌కు సంబంధించిన ఐరన్‌స్టాండ్ పక్కన ఉన్న పెట్రోల్‌బంక్‌లో ఉండడంతో ఆ స్టాండ్‌ను తీసుకొచ్చే క్రమంలో లింగయ్యతో పాటు పెట్రోల్‌బంక్‌లో పని చేసే వెంకటేశ్‌లు స్టాండ్‌లను తోపుకుంటూ వస్తుండగా పెట్రోల్‌బంక్ ముందున్న 11కేవీ విద్యుత్‌వైరుకు ప్రమాద వశాత్తు తగిలి షాక్‌కొట్టడంతో సంఘటన స్థలంలోనే లింగయ్య మృతి చెందాడు. వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. లింగయ్యకొడుకు జయరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లింగయ్యకు భార్య ఆవునూరి రాజవ్వ, కొడుకు జయరాజ్, కూతురు వసంత ఉన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

- పారిశుధ్య కార్మికులు లేక రాజంపేట ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామపంచాయతీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. జిల్లా కేంద్రంలో గత డిసెంబరు మాసంలో రాజంపేట కొత్తగా గ్రామపంచాయతీగా ఏర్పడింది. పంచాయతీకి ఇన్‌చార్జి కార్యదర్శి, ఒక జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, ఇద్దరు కామాటీల ను కేటాయించారు. రాజంపేటలో 10వార్డులు ఉన్నాయి. ఆయావార్డులలో పారిశుధ్య కార్యక్రమాలకు కార్మికులను కేటాయించలేదు. దీంతో ఆయా కాలనీలలో చెత్త సేకరణ నిలిచిపోయింది. కాలనీల్లో చెత్త కుప్పలు, కాలువల్లో పూడిక నిండిపోయింది. చెత్త సేకరణకు ఇటీవలే రెండు వాహనాలు ఇచ్చినప్పటికీ వాటిని నడిపేందుకు కార్మికులను కేటాయించలేదు. దీంతో రోడ్ల పక్కనే చెత్త పడేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి మూడు రెవెన్యూ గ్రామాలను కలిపి మున్సిపాలిటిగా మార్చారు. మరో రెవెన్యూ గ్రామం రాజంపేటను పంచాయతీగా ప్రకటించింది.

● పది వార్డులతో ఏర్పాటు..

రాజంపేట పంచాయతీ 10వార్డులతో ఏర్పడింది. ఇందులో 700కుపైగా కుటుంబాలు, 3,600వరకు జనాభా కలిగిఉంది. పారిశుధ్యకార్మికులను కేటాయించక పోవడం, నియమించుకునేందుకు జిల్లా అధికారుల నుంచి అనుమతి రాకపోవడంతో పనులు చేపట్టే వారు లేక చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఏ కాలనీలో చూసిన చెత్తకుప్పలు, కాలువల్లో పూడికనిండి అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఇటివలే చెత్త సేకరణకు మూడు వాహనాలు ఇవ్వగా ఇందులో ఒకటి పని చేయడంలేదు. వాహనాలను ఇచ్చినప్పటికీ కార్మికులను కేటాయించలేదు. ఇటీవల కలెక్టర్ వెంకటేష్ దోత్రే పంచాయతీకి కార్మికులను కేటాయించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవం లేదు. జూబ్లీ మార్కెట్ వద్ద వ్యాపారులు నిత్యం కుళ్లిన కూర గాయాలను పక్కనే పడేస్తుంటారు. దాన్ని తొలగించే సిబ్బందిలేక పోవడంతో దుర్గంధం వెదజల్లుతూ అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ విషయాన్ని ప్రజలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఇటివల గ్రామపంచాయతీ అధికారులు ప్రైవేటు కార్మికులతో చెత్తను తొలగించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రాజంపేటలో రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారం


రాజంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

రాజంపేట పంచాయతీలో నెలకొన్ని పారిశుధ్య కార్మికుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. పంచాయతీలో అత్యవసరం ఉన్నచోట ప్రైవేటు కార్మికులతో పనులు చేయిస్తున్నాం. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభించనుంది.

- శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేకాధికారి

చిరుతపులి దాడిలో ఆవు మృతి


మృతి చెందిన ఆవు

హాజీపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దంపేట సెక్షన్ పరిధిలోని పోచంపల్లి అడవి ప్రాంతంలో శనివారం ఉదయం మేతకు వెళ్లిన ఆవుల మందపై చిరుతపులి దాడి చేసింది. ఒక ఆవును ఈడ్చు కుంటూ వెళ్లి హతమార్చింది. ముర్రిగూడెం గ్రామానికి చెందిన కుడమేత సతీష్‌కు చెందిన ఆవులు సమీపంలోని అడవిలోకి వెళ్లగా చిరుతపులి దాడి చేసి చంపిన విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు పాద ముద్రలు గుర్తించి చిరుతపులిగా గుర్తించారు. కానీ గ్రామస్థులు మాత్రం చిరుతపులికి ఆవును ఎత్తుకెళ్లే శక్తి ఉండదని ఫారెస్టు అధికారులు దాడి చేసింది పెద్దపులికి బదులు చిరుత పులి అంటున్నారని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

కోటపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లూరు గ్రామంలో గోదావరి పరివాహక ప్రాంతంలో కోడి పందేల స్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. కొల్లూరు, చెన్నూరు, మహారాష్ట్రకు చెందిన పందెంరాయుళ్లు కోడి పందేలు ఆడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ రాజేందర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. చమత్కారి శంకర్, పాలరపు సమ్మయ్య, గగ్గూరి తిరుపతి, రమేష్, మధునయ్య, గంట రవి, తుంగపిండి శ్రీకాంత్, ఆలం చిరంజీవి, పోలోజు సుధాకర్, సదయ్యలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి 4 సెల్‌ఫోన్‌లు, రెండు కోళ్లు, రూ. 5400 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): గొంట్లపేట గ్రామ సమీపంలో శనివారం రాత్రి కోడి పందేలా స్థావరంపై ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. వారి నుంచి ఒక కోడిపుంజు, రూ.900 నగదు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పొలాల అమావాస్య రోజు విషాదం..

నీటి కుంటలో మునిగి యువకుడి మృతి


గురుదాస్(ఫైల్)

చింతలమానేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి జోడి గురుదాస్(28) శనివారం పొలాల అమావాస్య సందర్భంగా ఎడ్లను నీటి కుంటలో కడుగుతూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పొలాల పండగ సందర్భంగా మధ్యాహ్న సమయంలో ఎడ్లను శుభ్రం పరిచేందుకు గ్రామ సమీపంలో ఉన్న నీటి కుంట వద్దకు గురుదాస్ వెళ్లాడు. పశువులను కడిగే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని గజఈతగాళ్ల సహాయంతో గురుదాస్ మృతదేహాన్ని వెలికి తీశారు. గురుదాస్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

దహెగాం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం లగ్గాం ఎక్స్ రోడ్డు వద్ద శనివారం తనిఖీలు చేపట్టగా వ్యాన్(టీఎస్ 18టీ 1439)లో అక్రమంగా తరలిస్తున్న ఆరు పశువులు పట్టుకున్నామని టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టగా మహారాష్ట్రకు చెందిన ఇలియాజ్ నవాబ్ ఖురేషి, షకీల్ ఖురేషి, నిజామాబాద్‌కు చెందిన మొహమ్మద్ రహ్మత్‌లు వ్యాన్‌లో ఆరు పశువులను అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. పశువులను స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ విజయ్, మధు, రమేష్, సాయి, తమ్సీర్‌ఖాన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీరాంపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌కు చెందిన చింతల నర్సింగ్(47) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం... హిమ్మత్‌నగర్‌కు చెందిన నర్సింగ్ శ్రీరాంపూర్ ఓసీపీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శనివారం తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దర్తి అభ జనజాతీయ గ్రామీణ ఉత్సవ్ అభియాన్ ఆదికర్మ యోగి అభియాన్ పథకం కింద ఎంపికైన గిరిజన గ్రామాల్లో కావాల్సిన సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం వచ్చే నెల 7వ తేదీలోగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆదికర్మ మిషన్ బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25న మండల కేంద్రాలలో శాఖల వారీగా గ్రామ స్థాయి మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని అన్నారు. 29, 30 తేదీల్లో గ్రామ స్థాయి శిక్షణ తరగతులు ఎంపీడీవో కార్యాలయల్లో నిర్వహించాలని సూచించారు. వచ్చే నెల 1 నుంచి 7వ తేదీల్లో పథకానికి ఎంపికైన గిరిజన గ్రామాల్లో గ్రామస్థాయి నోడల్ అధికారి, కార్యదర్శి అధ్యక్షతన గ్రామంలో కావాల్సిన పథకాలను గుర్తించి నివేదికలు మండల స్థాయి నోడల్ అధికారి ఎంపీడీవోలకు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో శ్రీనివాస్, చిరంజీవి, మిషన్ భగీరథ ఈఈ సిద్దికి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి సదానందం, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థకు ఏ మేరకు లాభాలు వచ్చాయో వెంటనే వాటిని ప్రకటించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు జె శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పర్వతి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ కార్యాలయంలో శనివారం విలేకరులతో వారు మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు లాభాల వాటా కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని ఇంత వరకు ప్రకటించకపోవడం ఏంటని మండిపడ్డారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయుసీ ప్రభుత్వం తమదే అని చెప్పుకుంటున్న ప్రతిపక్ష సంఘం ఐఎన్‌టీయుసీ లాభాల విషయంలో ఏం చేస్తున్నాయని మండిపడ్డారు. 35శాత లాభాల వాటా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. తాము కార్మికుల శ్రేయస్సు కోసం ఆందోళనలకు సైతం సిద్ధం అవుతున్నామని తెలిపారు. సమావేశంలో సుదర్శన్, బోనాల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, చొప్పరి రామస్వామి, థామస్, ప్రభాకర్, పులిపాక గట్టయ్య, సంతోష్ పాల్గొన్నారు.

కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలి

బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్

రెబ్బెన, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 40 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాలో కైరిగూడ ఓపెన్ కాస్టు నుంచి గోలేటి సీహెచ్‌పీకి బొగ్గురవాణా చేసే లారీ డ్రైవర్లు, క్లీనర్లు సింగరేణి సంస్థకు లాభాలను తెచ్చిపెడుతున్నారన్నారు. కాని వీరికి జీత భత్యాలు చెల్లింపులు చేయటం యాజమాన్యం ఇంత వరకు వీరిని పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా వీరికి కూడా స్పెషల్ ఇన్‌సెంటీవ్ ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిరుపతి, ఆశోక్, లచ్చన్న, రవి, స్వామి పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

మందమర్రిటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని జీఎం దేవేందర్ అన్నారు. ఏరియాలోని కేకే1 డిస్పెన్సరీలో ఉద్యోగులకు సంబం, దించిన పీఎంఈకి సంబంధించిన ఓ ఫాములు ఆసుపత్రి మేనేజ్‌మెంట్ సిస్టంలోకి 40వేలు అప్‌లోడ్ చేసిన సిబ్బందికి శనివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని చెప్పారు. గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదక సంబంధించి రక్షణ ఎలా చేపడుతారో అలాగే స్థాయిలో ఆసుపత్రిలో వైద్యం మెరుగ్గా అందిన రోజే కార్మికుడి జీవితం ఆనందంగా ఉంటుందని తెలిపారు. కేకే1 డిస్పెన్సరీలో సిబ్బంది పనితీరు బాగుందని ఆయన అభినందించారు. గనుల, డిపార్ట్‌మెంట్ల నుంచి పీరిడియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్(పీఎంఈ)కి వచ్చే ఉద్యోగులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఉద్యోగికి సంబంధించినటువంటి ఆరోగ్యం వివరాలు అందులో ఉంటాయని తెలిపారు. అనంతరం నక్క సుషమ్మ(స్టాఫ్‌నర్సు), జనరల్ అసిస్టెంట్ నడిమెట్ల సాహిత్యకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, డాక్టర్ శైలజ, డాక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జీఎం దేవేందర్

లాభాల వాటా 35 శాతం అందించాలి


సీఎండీ బలరాంను అభినందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల వాటాలో కార్మికులకు 35 శాతం లాభాల వాటా అందించాలని ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వి. సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ కోరారు. సింగరేణి సంస్థకు బంగారు, రాగి గనుల అన్వేషణకు లైసెన్స్ వచ్చిన సందర్భంగా వారు సీఎండీని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత నెలలో రిఫరల్ ఉద్యోగులకు మెడికల్ బోర్డు నిర్వహించి తక్కువ మందిని అన్‌ఫిట్ చేశారని అన్నారు. ఈ విషయంలో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, అలా కాకుండా ప్రతి నెలలో బోర్డు నిర్వహించి, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగినీ ఇన్‌వ్యాలిడేషన్ చేయాలని కోరారు. త్వరలో ఇల్లందు ఏరియాలో ప్రారంభం కానున్న కేటీసీ గనికి సంబంధించిన నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ అమలు చేయాలని, యాజమాన్యమే ఈ గనిని నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను ఆలకించిన సీఎండీ పరిష్కారానికి హామీ ఇచ్చారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కె. సారయ్య, కె. వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ ఉన్నారు.

ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని పూజలు

మంచిర్యాలక్రైం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ నాయకులు విశ్వ నాథాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్య క్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, తిరుపతి పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్మిళ్ల వేణు, సంపత్‌రెడ్డి, ధరణి మధుకర్, భూపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ప్రేంసారా వుపేరిట పేరిట కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు నిర్వహించినట్లు పీసీసీ సభ్యులు నూకల రమేశ్ తెలిపారు. నయీం, శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దం జనార్ధన్, నరేందర్, నవీర్, రంజిత్, అనిరుద్, విజయ్, అశోక్, అక్బర్, సంతోష్ పాలొన్నారు.

దండేపల్లి: గూడెం సత్యదేవుడికి ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: బుగ్గ దేవాలయంలో పూజలు చేశారు. కాంగ్రెస్ మంచిర్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ క్రిష్ణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆద ర్శవ ర్ధన్, మాజీ ఎంపీటీసీ భీంరావు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాకేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన భీమన్న క్రీడామైదనంలో శనివారం 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పతకాన్ని ఆవిష్కరించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన భీమన్న క్రీడామైదానంలో అంతర్ జిల్లాల బాల్‌బ్యాడింటన్ టోర్నీ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అతి చిన్న గ్రామంలో భారీ స్థాయిలో పోటీలు నిర్వహించడం రాష్ట్రానికే హర్షణీయమన్నారు. రెబ్బెన నుంచి జాతీయ స్థాయిలో 300 మంది క్రీడాకారులు ఆడినట్లు చెప్పారు. ఇందులో నలుగురు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నారని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో క్రీడాకారులకు తన వంతు సహాయం చేస్తామని ప్రకటించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓడిన వారు గెలిచేందుకు మళ్లీ ప్రయత్నించాలన్నారు. ఈ ప్రాంతంలో క్రీడాకారులను అభివృద్ధి పరుస్తున్న ద్రోణాచార్యులు ఆర్ నారాయణరెడ్డితో పాటు ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి, షార్ప్ స్టార్ సెక్రటరీ ఎం వెంకటేశ్వర్లు చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. బెల్లంపల్లి జీఎం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు ఎంతగానో ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని చక్కటి ప్రతిభ కనబరిచి సింగరేణితో పాటు జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఎంమాధవి, దుర్గయ్య, వెంకటరమణ, శ్రీనివాస్, రాజన్న, ఎ.రవీందర్ గౌడ్, ఎం.వెంకటేశ్వర్లు, బయ్యన్న, మాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ ట్రాకర్ యాప్‌తో అవస్థలు

- మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యం లేక ఇబ్బందులు

సిర్పూర్(టి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పోషణ్ ట్రాకర్‌యాప్ అంగన్‌వాడీటీచర్లకు కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. సిర్పూర్(టి) ఐసీడీఎస్ పరిధిలోని 44 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యాలులేని చోట మారుమూల గిరిజన ప్రాంతాల్లో అర్హులైన వారి వివరాలను వీడియోరూపంలో నమోదుచేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ నమోదు టీచర్లకు తీవ్రఇబ్బందులు తెచ్చిపెడుతుంది. దీంతో పాటు కొందరి ముఖ ఆధారిత గుర్తింపు ఆధార్‌కార్డులు అప్‌డేట్‌కాకపోవడంతో మొదటి నుంచి వివరాలు నమోదు చేయాల్సి వస్తుందని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో ఆధార్ నమోదు సెంటర్‌లేక పోవడం ప్రధాన సమస్యగా ఉన్నప్పటికీ టీచర్లు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించి పోషణ్‌ట్రాకర్ యాప్‌లో నమోదు చేయడానికి కష్టపడుతున్నారు. ముందే తక్కువ వేతనం, ఎక్కువ పనిభారం పెరిగిందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాత ఆఫ్‌లైన్ విధానంద్వారా నమోదు ప్రక్రియ చేపడితే బాగుటుందని అంగన్‌వాడీ టీచర్లు అభిప్రాయ పడుతున్నారు.


యాప్‌లో ముఖచిత్రం నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్


యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సంక్షిప్త సమాచారం

తాండూర్ : మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీలో నెలకొన్న ప్రదాన సమస్యలను పరిష్కరించాలని ఆరు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం ముందు తుడుందెబ్బ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

చెన్నూరు: మండలంలోని పొక్కూరు గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు శనివారం పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్ విద్యుత్ వినియోగదారులకు పలు సూచనలు చేశారు.

కాసిపేట: దేశ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాల వల్లనే గ్రామ సౌభాగ్యం సాధ్యపడుతుందని బీజేపీ మండల అధ్యక్షులు నూరం సంపత్ అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘర్‌ఘర్ బీజేపీ, హర్‌ఘర్ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ధర్మరావుపేటలో పర్యటించారు.

కన్నెపల్లి : మండలంలో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిలు పర్యటించారు. సుర్జాపూర్ గ్రామాన్ని సందర్శించి పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు. అలాగే సుర్జాపూర్‌నుంచి భీమినికి వెళ్లే దారిలో ఉన్న ఎర్రవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లాలో నవ భారత సాక్షరత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వయోజన విద్య కార్యాలయంలో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. నిక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని మండల స్థాయిలో విజయవంతం చేయాలన్నారు.

మంచిర్యాలక్రైం: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే వినోద్ చేతుల మీదుగా కరపత్రాలు విడుదల చేశారు. తపస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

జన్నారం: ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఓటు చోరిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఓటు చోరిపై ఎన్నికల సంఘంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని, అదే విధంగా గ్రామస్థాయిలో ప్రతి కార్యకర్త ఓటు చోరిపై పోస్టుకార్డు ద్వారా రాష్ట్ర పతికి సంతకాలతో కూడిన వినతిపత్రాలను పంపుతామని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు సోహేల్ అన్నారు.

నస్పూర్ : కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నాయకులు అన్నారు. నస్పూర్‌లోని నర్సయ్య భవన్‌లో శనివారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సురవరం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండల పార్టీ కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు లింగం రవి, కారు కూరి నగేష్, కిషన్‌రావు, రవీందర్, సురేష్, శంకర్, లక్ష్మన్, అంజనేయులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన పోడూరి శేఖర్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పూర్ణచందర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈసందర్భంగా వ్యవస్థాపకులు ముడుగు ప్రవీన్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలువడం మన అందరి బాధ్యత అని అన్నారు.

తాండూర్ : మండలంలోని మాదారం గ్రామ శివారులోని చింతలలొద్ది ప్రాంతంలో పెద్దపులి తిరుగుతున్నట్లు బీట్ ఆఫీసర్ భాస్కర్ శనివారం తెలిపారు. ప్రస్తుతం పులి గుట్ట మీద ఉందని అటు వైపు వెళితే తిర్యాణివైపు వెళ్తుందని ఇటు వైపు వస్తే మాదారం వైపు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

జైపూర్ : ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గంగిపెల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.



నస్పూర్‌లో అసంపూర్తిగా పిల్లర్ల వద్ద నిలిచిపోయిన నిర్మాణం

గుంతలు తవ్వారు.. వదిలేశారు..

- మంచినీటి పథకాల పనుల్లో జాప్యం...
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నస్పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణ వాసుల దాహార్తిని తీర్చడానికి మంచినీటి ట్యాంకుల నిర్మాణం కోసం రూ. 73 కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణ వాసులకు గోదావరి నీటిని సరఫరా చేయడానికి అమృత్-2.0 పథకం ద్వారా ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణాలు కోసం నిధులు మంజూరయ్యాయి. గత నవంబరులో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ గుంతలు తవ్వి బెడ్, పిల్లర్ల వరకు, మరి కొన్ని చోట్ల గుంతలు తవ్వి వదిలి పెట్టారు. ట్యాంకుల నిర్మాణాల ఇళ్ల సమీపంలో ఉండడం, కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. సీతారాంపల్లిలో మంచినీటి శుద్ధి కేంద్రం, కొత్త పైపులైన్, ట్యాంకుల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. పథకం నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ వాసుల నీటి సమస్య చాలా వరకు తీరే అవకాశం ఉంటుంది.



నస్పూర్‌లోని నందనవనం పార్కు ఎదురుగా జయశంకర్ కాలనీలో తవ్విన గుంత

● ఎక్కడెక్కడ ట్యాంకులు...

ప్రస్తుతం గోదావరి నదిలో ఇది వరకు ఉన్న ఇన్‌టెక్ వెల్ (నాలుగు గ్రామ పంచాయితీ అధీనంలోనిది)ను ప్రస్తుత స్కీంకు అనుగుణంగా మార్పులు చేసి పైపులైన్ నిర్మాణం చేయనున్నారు. సీతారాంపల్లి రైతు వేధిక వెనుక నీటి ట్రిట్‌మెంట్ ప్లాంట్ (మంచినీటి శుద్ధి కేంద్రం) నిర్మాణం చేయనున్నారు. పట్టణంలోని ఏడు చోట్ల నస్పూర్ రోడ్, సీతారాంపల్లి, హసింగ్ బోర్డు కాలనీ, నందనవనం పార్కు సమీపంలో, శ్రీరాంపూర్, హను మాన్ టెంపుల్, శ్రీరాంపూర్ బస్టాండ్ ఎదురుగా మంచి నీటి ట్యాంకులను నిర్మాణం చేయనున్నారు. కొన్ని చోట్ల ట్యాంకులకు బెడ్, పిల్లర్ల స్థాయి వరకు, మరికొన్ని తవ్వి వదిలి సిమెంట్ పనులు చేసి వదిలిపెట్టారు. కూలీల కొ రత కారణంగా పనులు ఆలస్యం జరుగుతున్నట్లు తెలు స్తోంది. ఏడు చోట్ల నిర్మించే మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు 800 కేఎల్ నుంచి 1500 కేఎల్ వరకు సా మర్థ్యం కలిగిన ట్యాంకులను నిర్మిస్తారు. ఆయా ప్రాం తాల్లో ట్యాంకులకు 18 కిలో మీటర్ల పైపులైన్ నిర్మించి నీటిని సరఫరా చేస్తారు. ఏడు చోట్ల ఉన్న ట్యాంకుల నుంచి 11 కిలో మీటర్ల దూరం పైపులైన్‌ను మంచినీటి పంపిణీ కోసం నిర్మాణం చేయనున్నారు.

● వచ్చే జూన్ నాటికి పూర్తయ్యేనా...?

2026 జూన్ నాటికి ట్యాంకులు, ఇన్‌టెక్ వెల్, పైపులైన్ పనులు, పంపిణీ పైపులైన్ పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జరు గుతున్న ఆలస్యం కారణఃఅ గడువులోగా పథకం పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రా క్టర్ నిర్మాణ పనులు వేగవంతం చేస్తేనే ట్యాం కుల పనులు సకాలం పూర్తయ్యే అవకాశాలున్నాయి. ట్యాంకులను, పైపులైన్‌ను ఇదివరకు ఉన్న మిషన్‌భగీరథ ట్యాంకులకు అనుసంధా నం చేసి అన్నివాడల్లోని ఇళ్లకు మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో అమృత్-2.0 పథ కం పనులు ప్రారంభించారు. మిషన్‌భగీరథలో ఇంటి నల్లా కనెక్షన్‌లేని వారికి కూడా ఈ కొత్త స్కీంలో కనెక్షన్ ఇవ్వనున్నారు. అమృత్-2.0 పథకం పూర్తయితే పట్టణంలో మంచినీటి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. అధికారులు త్వరగా నిర్మాణ పనులు చే సి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ డివిజనల్ ఇంజనీర్ మధుకర్‌ను సంప్రదిం చగా నిర్మాణపనులు తొందరగానే పూర్తి చేస్తామన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం,ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): వినాయక నవ రాత్రి ఉత్సవాలను మత సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకో వాలని సీపీ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. శాంతి సమావేశంలో ఆ యన మాట్లాడుతూ మత పెద్దలతో గణేష్ చతుర్థి, మిలాద్ ఉన్ నబి పండగల దృష్ట్యా ఈ సమావేశం ఏర్పాటు చేశారు. గత సంవత్సరం రామగుండం కమిషనరేట్ పరిధిలో 4786 విగ్రహాలను ఏర్పాటు చేయగా మంచిర్యాల జోన్‌లో 2316 విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. నిర్వాహకులు అన్ని వివరాలతో సంబంధిత పోలీసు స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గణపతి మండపాల వద్ద జరిగే కార్యక్రమాలకు బాధ్యత వహిస్తూ ప్రతి ఒక్క గణపతి మండప కమిటీ అధ్యక్షులు ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. మద్యం సేవించి మండపాల వద్దకు రావద్దన్నారు. తప్పనిసరిగా విద్యుత్‌శాఖ వారి అనుమతి తీసుకోవాలని నాణ్యమైన వైర్లను పరికరాలను వినియోగించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొంత మంది సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు పుకార్లతో ఇతరుల మనోభవాలు దెబ్బతినేలా పోస్టు పెట్టే అవకాశం ఉందని ప్రజలు వాటిని నమ్మవద్దని సమన్వయం పాటించాలన్నారు. అత్యవసర సమయంలో వందకు గాని లేదా 8712656597 సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు కరుణాకర్, భాస్కర్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ మహేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, పీస్ కమిటీ సభ్యులు అన్ని మతాల పెద్దలు పాల్గొన్నారు.

ఎర్రగుంట చెరువు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట చెరువుకు గండికొట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం ఆర్డీ వో కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌కు రైతు కార్మికసంఘాల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం అందించారు. కన్నాల గ్రామంలో ఆరు దశా బ్దాలకు పైగా ఉన్న ఎర్రగుంట చెరువును కొందరు రియల్‌ఎస్టేట్ వ్యా పారులు తమ వెంచర్లను విస్తరించుకోవడం కోసం శిఖం భూమిని కబ్జా చేయడమే కాకుండా చెరువును గండికొట్టారన్నారు. అధికారులు సర్వే చేపట్టి కబ్జాకు గురైన చెరువును కాపాడాలని అదే విధంగా ధ్వంసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మణిరాంసింగ్, చాంద్‌పాషా, గోగర్ల శంకర్, అంబాల మహేందర్, దుగుట రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌ప్రసాద్

దండేపల్లి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం దండేపల్లి ప్రభుత్వజూనియర్ కళాశాలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలో వచ్చి 18నెలలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు శరత్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

క్రికెట్...కిరికిరి

(5వ పేజీ తరువాయి)

ఒక్కరు కూడా రంజీ స్థాయిలో ఎంపిక కాకపోవడం పైనా జోరుగా చర్చ సాగుతోంది. మరోవైపు ప్రతిభగల క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగకుండా అణగదొక్కు తున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అత్యంత ప్రతిభ కలిగిన క్రీడాకారులను వివిధ కారణాలతో జ ట్టుకు ఎంపిక చేయకుండా తన అనుయాయులకు పె ద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నా యి. హెచ్‌సీఏ బాధ్యులపై ఇటీవల చర్యలు తీసుకున్న నేపథ్యంలో దాని ప్రభావం ఉమ్మడి జిల్లా క్రికెట్ అసో సియేషన్ పైనా పడింది. ఇదిలా ఉండగా మంచి ర్యాల జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మై దానంలో క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులకు ట్రెనింగ్ ఇచ్చేందుకు ప్రతి యేటా లక్షల రూపాయల నిధులు వస్తుంటాయని తెలుస్తోంది. వాటిని సక్రమంగా వినియోగించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు...

జిల్లా క్రికెట్‌లో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై ఇటీవల పలు క్రీడా సంఘాల బాధ్యులు డీసీపీ ఎగ్గడి భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. క్రికెట్‌లో నెలకొన్న అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదులు అందాయి. అలాగే సైబరాబాద్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు సైతం జిల్లాలోని మందమర్రికి చెందిన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడిమల్ల నర్సింహులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వల్ల జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

అలాగే హెచ్‌సీఏను పక్కనపెట్టి తెలం గాణ క్రికెట్ అసోసియేషన్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కాసిపేట, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపు కోవాలని కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. శనివారం కాసిపేట పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిర్దేశించిన సమయానికే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. గణేష్ మండపాలు ప్రజారవాణకు, ఎమర్జెన్సీ వాహనాలకు ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి పదిగంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలి.

నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరిగేంత వరకు అందరూ సహకరిం చాలని ఆయన కోరారు. ఎవరికైన ఏమైన సందేహాలు, ఇబ్బందులు తలెత్తితే 100కు డయలు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): 11 వ జూనియర్ అథ్లెటిక్ చాం పియన్‌షిప్ క్రీడాపోటీల్లో బెల్లంపల్లి పట్టణానికి చెందిన క్రిష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14, 16, 18, 20 విభాగంలో క్రిష్ణవేణి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలికల విభాగంలో సహస్య జావలిన్ త్రోలో బ్రాంజిమెడల్, కే. దీక్ష 60మీటర్ల లాంగ్ జంప్, 600 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజి మెడల్ సాధించారన్నారు. విద్యార్థులను క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ జోనల్ అకాడమిక్ మేనేజర్ సంపత్‌రావు, పాఠశాల డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజారమేశ్‌లు సత్కరించారు. ఈ కార్యక్ర మంలో వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేశ్ యాదవ్, సంతోష్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి(లక్షెట్టిపేట) ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం లక్షెట్టిపేట పట్టణంలో మహాలక్ష్మివాడ, తిలక్‌నగర్, వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలతో పాటు దోమల నివారణ పిచికారిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ల శోభ, ఎంఎల్‌హెచ్‌పి రజిత, ఏఎన్ఎం విజయ, హెల్త్ అసిస్టెంటు గఫూర్, ఇసాక్ అహ్మద్, వేణు, బ్రీడింగ్ చెకర్ బాలాజీ పాల్గొన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటి పరిదిలో తిలక్‌నగర్‌లో శనివారం మున్సిపాల్ కమిషనర్ విజయ్‌కుమార్, తమ సిబ్బందితో సందర్శించి జ్వరం పీడిత ఇళ్లకు వెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కందుల రాజేష్, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బిసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

మంచిర్యాలక్రైం,ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డు ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచాలని అసెంబ్లీలో చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్, కర్రె లచ్చన్న, మధుసూదన్, గజెల్లి వెంకన్న పాల్గొన్నారు.

పోడు సమస్యను పరిష్కరించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్

నెన్నెల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పోడు భూముల్లో సాగులో ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలం నుంచి సాగులో ఉన్నప్పటికి వారికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. పోడు సమస్య పరిష్కరించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నెన్నెల తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెన్నెల శివారు సర్వే నంబరు 671, 672లలో సాగు చేసుకుంటున్న వారిని అటవిశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. రెవెన్యూ, అటవి శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన వారందరికి వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, మాజీ మండల అధ్యక్షులు శైలెంద ర్‌సింగ్, నాయకులు వైద్య శ్రీధర్, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. అనంతరం చిత్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రధాని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌గౌడ్

భీమిని : భారత ప్రధాన మంత్రి దేశంలో అన్నీ వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం మహా జెన్ సంపర్కు అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పొలాల అమావాస్య పర్వదినం సందర్భంగా గ్రామంలో ఎద్దులకు పూజ చేశారు. అనంతరం భీమిని పరివాహక ప్రాంతాల్లో ఎర్ర, నల్ల వాగులలో అకాల వర్షాల వల్ల నష్ట పోయిన పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్ట తీవ్రతలను అడిగితెలుసుకున్నారు. సుర్జాపూర్ గ్రామంలో అడవి పంది దాడిలో మృతి చెందిన దాగాం రామయ్య కుటుంబీకులను పరామర్శించారు. మల్లీడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ కర్నె మమత శ్రీనివాస్ తమ్ముడి కుమారుడు మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. భీమిని మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వర్షాలకు నష్ట పోయిన రైతులను వెంటనే ఆదుకోని పరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ బికర్ణ దాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమరా జుల శ్రీదేవి, రాచర్ల సంతోష్, వైద్య శ్రీధర్, మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, కన్నెపల్లి అధ్యక్షుడు ఆశన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆదరిస్తే కార్మికులకు న్యాయం చేస్తా

కాసిపేట, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జరిగే ఓరియంట్ సిమెంట్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ యూనియన్‌ను ఆదరించి గెలిపిస్తే కార్మికులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు అన్నారు. శనివారం దేవాపూర్‌లో నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా కొనసాగుతున్న గుర్తింపు సంఘం కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కాని ఇప్పుడు ఈ ఎన్నికల్లో తమ యూనియన్ గెలిచినట్లయితే 24గంటల వైద్య సదుపాయంతో పాటు ఉన్నత విద్య కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పాటుపడుతానన్నారు. ఇతర కార్మిక సంఘం నాయకులు నాన్‌లోకల్ అని బద్‌నాం చేస్తున్నారన్నారు. కాని స్థానికంగా ఉండి హక్కుల కోసం కొట్లాడేవాడే నిజమైన నాయకుడవుతాడన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామన్నారు. కార్మిక నాయకులందరూ అమోల్యమైన ఓటు తరాజు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మేరుగు శంకర్, సతీష్‌రెడ్డి, రమణారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



దేవాపూర్‌లో మాట్లాడుతున్న సత్యపాల్‌రావు

ఘనంగా పొలాల అమావాస్య

నెన్నెల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు సాగులో తోడుండే మూగ జీవాలను కొలిచే పోలాల అమావాస్యను శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించుకున్నారు. పల్లెలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని దైవాన్ని వేడుకున్నామని రైతులు పేర్కొన్నారు.

వేమనపల్లి : గ్రామాల్లోని ప్రజలు శనివారం పొలాల అమావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. ఎద్దులతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. వ్యవసాయం, పిల్లా పాపలు చల్లగా ఉండాలని కోరుకున్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని గ్రామాల్లో పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎద్దులను, ఆవులకు అలంకరించి పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. ఆలయాల్లో పూజలు చేశారు.

సంతలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలి

తాండూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శనివారం సంతలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం వెంటనే చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సంతలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి వచ్చిందని, నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. నిర్మాణం కోసం ముగ్గు పోసి వదిలేశారని మండిపడ్డారు. సంతకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వ్యాపారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తారని, సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సంతలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలన్నారు.శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అం దించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మామిడి విఘ్నేష్, పుట్ట కుమార్, ఉపాధ్యక్షుడు రేవెల్లి శ్రీనివాస్, నాయకులు మహీధర్‌గౌడ్, పాల్గొన్నారు.

ప్రజలకు ఇళ్ల పట్టాలను అందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ప్రాంతాల్లోని ప్రజలకు ఇళ్ల పట్టాలను అందించాలని నస్పూర్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు అక్కూరి సుబ్బయ్య, ఈసంపల్లి ప్రభా కర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరాంపూర్ కాలనీలోని పలు కాలనీల ప్రజలకు ఇళ్ల పట్టాలు రాలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ, సీఎం దృష్టికి తీసుకువెళ్లారన్నారు. ఆ సమయంలో ఆర్కే 6 మైన్ ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ వస్తుందని ఇళ్ల ప ట్టాలు మంజూరు చేయలేదన్నారు. అనంతరం ఓపెన్‌కాస్టు రావ డం లేదని ప్రభుత్వం చెప్పిందన్నారు. వెంటనే ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్, తిరుపతి, రాజేంద్రపాణి, సంపత్, పాల్గొన్నారు.

- రసాయన ఎరువుల అతివాడకంతో అనర్థాలు
- విషతుల్యమవుతున్న ఆహార పదార్థాలు
- అప్రమత్తత అవసరమంటున్న వ్యవసాయ అధికారులు

మోతాదు మించితే ముప్పే



పంటలకు క్రిమిసంహారక మందు స్ప్రే చేస్తున్న రైతు

వ్యవసాయ పంటలపై మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని, విచ్చలవిడిగా కుమ్మరిస్తే భూమి నిస్సారమవుతుదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అధికారుల సూచన మేరకు మితంగా వాడాలని సూచిస్తున్నారు.

వాంకిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో మోతాదుకు మించిన ఎరువులు, పురుగుల మందులు వినియోగిచవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నా రైతులు పాటించడం లేదు. జిల్లాలో అన్నదాతలు తెల్లబంగా రాన్ని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. జిలా వ్యాప్తంగా పత్తి 3,29,184 ఎకరాల్లో, కంది 27,178 ఎకరాల్లో, సో యా 2872 ఎకరాల్లో, మొక్కజొన్న 4610 ఎక రాల్లో, పెసర 617 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కొంత మేర దెబ్బతీశాయి. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో పత్తి మొక్కల ఎదుగుదల తగ్గిపోయింది. చీడపీడల బెడద కూడా అధికంగా ఆశించే ప్రమాదముంది. దీంతో రైతులు ఇప్పటి నుండే రసాయన ఎరువుల వాడ కంపై దృష్టి పెడుతున్నారు. పంటల సాగులో మోతాదుకు మించిన ఎరువులు, పురుగుల మం దులు వినియోగించ వద్దని వ్యవసాయ అధికారులు తరచు రైతులకు సూచనలు అం దిస్తున్నా మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించడంలేదు. అధిక మోతాదుల్లో రసాయన ఎరువులు, పురుగుల మందులు విచక్షణారహితంగా వినియోగిస్తున్నందున రైతులు ఏటా పంటల దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోవల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రసాయనాల ఎరువులు వాడకంవల్ల వేల రూపాయలు వృధా తప్ప ఎలాంటి లాభం లేదన్న విషయాన్ని రైతులు తెలుసుకోవడంలేదు. సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సీజన్‌కు అనుగుణంగా రైతులు వివిధ రకాల పంట సాగు చేస్తారు. అయా పంటలను ఆశించే తెగుళ్ళను నివారించెందుకు రై తులు విచ్చలవిడిగా ఎరువులు, పురుగుల మందులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు బారం పడుతుంది. మార్కెట్లో వస్తున్న కొత్త రకం ఎరువులు, పురుగుల మందు లను తక్కువ ధరలకు అందిస్తుండడంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారు. వివిద రకాల కంపెనీల డీలర్లు రైతుల అమాయకత్వాన్ని ఆసరగా తీసుకుని ఎరువులు, పురుగు మం దులను అంటగుడతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోకుండా మందులను వాడుతుండడంతో పురుగుల నివార నేమో గాని ఉన్న పంటలను కోల్పోవల్సిన దుస్థితి ఎదురవుతుంది.

భూసార పరీక్షలపై నిర్లక్ష్యం..

పంటసాగుచేసే సమయంలోనే రైతులు తప్పటడుగులు వేస్తున్నారు. భూసార పరీక్షలు చేయించకుండానే పంటలు వేస్తున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పట్టించుకోవడంలేదు. ఆపై వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడికూడా చేతికి రావడంలేదు. అలా కాకుండా వ్యవసాయ అధికారుల సూచనల మెరకు భూసార పరీక్షలు చేయించి ఆపై ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తే మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంతో..

సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు దీర్ఘకాలంగా తక్కు వ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చు. రసాయన ఎరువుల, పురుగుల మందుల వాడకంతో ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో పర్యావరణానికి మేలు చేకూరి పెట్టుబడి భారం తగ్గుతుంది. పురుగుల మందులు కొనుగోలు చేసేటప్పడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి.వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి.

అవగాహన లేక..

చాలా మంది రైతులకు పురుగు మందుల వాడకంపై అవగాహన లేక ఎరువుల డీలర్లు, వ్యాపారులు సూచిస్తున్న మందులనే పిచికారీ చేస్తున్నారు. ఒక్కో కంపెనీ తయారు చేసే మందు ప్రభావం ఒక్కోరకంగా ఉంటుంది. పిచికారీ చేసే వ్యక్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఏ పురుగుకు ఏ మందు వాడాలో తెలియని పరిస్థితి ఉంది. పంటలపై పిచికారీ చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలియడం లేదు. కొన్ని రసాయన మందులు ఘాటైన వాసన కలిగి ఉంటే కొన్ని తేలికగా ఉంటాయి. రైతులు ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు మందులను పిచికారీ చేసి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. పిచకారీ చేసిన మందు శరీంలోకి వెళ్తే నాడీ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ దెబ్బతిని వాంతులు, తలనొప్పులు వచ్చి అపస్మారక స్థితికి చేరుకొని ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. మందులు పిచికారీ చేసే సమయంలో ముక్కుకు, నోటికి మాస్కులు ధరించాలి, చేతికి గ్లౌజులు వేసుకోవాలి, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కొన్న తరువాత భోజనం చేయాలి, వ్యవసాయ అధికారులు సూచనాలను పాటించాలి.

అధికారుల సూచనలు పాటించాలి..

- గోపీకాంత్, వ్యవసాయాధికారి



పంటలపై పురుగుల మందులు వేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంలో ముందుస్తు సలహాలు తీసుకోవాలి. రైతులు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందుల వాడితే పంట దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పంటసాగుకు ముందు భూసార పరీక్షలు చేపించుకుంటే మేలు. పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిస్తే రైతులకు పంట దిగుబ డులు పెరిగే అవకాశం ఉంటుంది.

పనులను వేగవంతం చేయాలి

బెజ్జూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. రెబ్బెన గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీవో గౌరి శంకర్, ఏపీవో రాజన్న, కార్యదర్శి సాయినాథ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెంచికలపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి కొడప నవదీప్ పాము కాటుతో గురువారం రాత్రి మృతి చెందగా శనివారం బాధిత కుటుంబాన్ని ఎస్సై అనిల్‌కుమార్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది శ్రీకాంత్, సురేష్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో శ్రమదానం

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ, లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కౌటాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్కి గ్రామానికి చెందిన నైని మధుకర్(34) అనే యువకుడు మద్యం మత్తులలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. ఆవేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మధుకర్‌భార్య రాంబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వాంకిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గ్రామ పంచాయతీలో సర్పంచు కాలంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై శనివారం డీఎల్‌పీవో ఉమర్ విచారణ జరిపారు. గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం పై ఇటీవల పత్రికల్లో వార్తలతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మెరకు శనివారం విచారణ జరుపుతున్నట్లు డీఎల్‌పీవో ఉమర్ తెలిపారు.

పనిభారం తగ్గించాలి

కెరమెరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ వెలుగులో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న గ్రామ సమైక్య సంఘం అసిస్టెంట్‌లతో 67 రకాల పనులు చేయిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారని పని భారం తగ్గించాలని సీఐటీయూ నాయకుడు ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేశ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో శిబిరాలు

ఆసిఫాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు 28, 29 తేదీల్లో అంచనా శిబిరాలు నిర్వహిస్తామని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డివిజనల్ డిస్ట్రిక్ సైన్స్ కేంద్రంలో, 29న ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణ, సాయికుమార్, చిరంజీవి, వెంకటేష్, రాకేష్, తిరుపతి, రంజిత్, శ్రావణ్, ధనుంజయ్, వినీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

సిర్పూర్(టి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ రామానుజం అన్నారు. శనివారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండలీల వద్ద నిర్వాహకులే గస్తీ ఉండాలని, మసీదులలో నమాజ్ అయ్యే సమయంలో సమీపంలో ఉన్న మండలీల నిర్వహకులు తక్కువ సౌండ్ పెట్టుకోవాలన్నారు. నిమజ్జనం రోజు శాంతియుతంగా నిర్వహించాలని, డీజేలు వాడరాదన్నారు. గణేష్ మండలీల నిర్వహకులు అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. పోలీసు శాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై కమలాకర్, ఏఎస్సై రాములు తదితరులు పాల్గొన్నారు.

వట్టివాగు కాలువ గండి పూడ్చాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్పలగూడ గ్రామ సమీపంలో వట్టివాగు ప్రాజెక్టు డి-4 కాలువ గండి పడడంతో నీరు వృధాగా పోతుందని గండిని పూడ్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గండి పడ్డ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు వృధా పోతుండ డంతో రైతులు వరి నాట్లు వేయకుండా ఉన్నార న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీకానంద్, అశోక్, కార్తీక్, మల్లేష్, మహేష్, బాబు, లచ్చయ్య, సంతోష్, శేఖర్, రాజన్న, అరుణ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



కాలువ గండిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ట్రైనీ బీట్ అధికారుల పర్యటన



సిర్పూర్(టి) రేంజ్‌లో పర్యటిస్తున్న ట్రైనీ బీట్ అధికారులు

సిర్పూర్(టి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్‌లోని ఇటిక్యాల పహాడ్‌లో తెలంగాణ ఫారెస్టు అకాడమీ 37వ బ్యాచ్ ట్రైనీ బీట్ ఆఫీసర్లు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం పర్యటించారు. ప్లాంటేషన్ విజయవంతం చేయడానికి తీసుకున్న చర్యలను టైగర్ ట్రాకింగ్ చేస్తున్న విధానాన్ని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్, ట్రైనీ బీట్ ఆఫీసర్లకు తెలియజేశారు. అనంతరం ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేసిన నీటి కుంటలను, చెక్ డ్యాంలను పరిశీలించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ గంగిరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్ నరేష్, వాచర్లు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధుల జాడ లేదు

కాగజ్‌నగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం 18 నెలలుగా నిధులు విడుదల చేయడం లేదని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లోని తన నివాసంలో శనివారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి సీతక్క రూ.2200 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు అంటూ ప్రజలను మోసగించారని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఏడాదిన్నరగా నిధులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనే పరిస్థితి కూడా లేదన్నారు. ఇప్పుడు పనుల జాతర అంటూ కొత్త డ్రామా మొదలు పెట్టారని అన్నారు. ఇందులో ఏయే పనులు చేపడుతున్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని పూజలు

జైనూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంగర్‌రావు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలోకి రావాలని శనివారం జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్ తదితరులు మండలంలోని జంగాం పొలిమేర్లలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు జన్నావార్ పవన్ కుమార్, మేస్రాం అంబాజీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంగారాం, ఆత్రం దత్తు, డాక్టర్ రామారావ్ ఘూటె, ధరమసింగ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

జైనూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం పొందిన తహసీల్దార్ ఆడ బీర్షావ్‌ను ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది శనివారం సన్మానించారు. కార్యక్ర మంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్, గ్రామ కార్యదర్శులు భరత్, సురేఖ, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ఆదర్శం

వాంకిడి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శమని బౌద్ధ గురువులు బంతే బుద్ధ ఘోష్, బంతే భరద్వాజ్ అన్నారు. స్థానిక జైత్వాన్ బుద్ధ విహార్‌లో నిర్వహిస్తున్న గ్రంథ పఠన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బుద్ధుడి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఎస్ఐ నాయకులు అశోక్, ఉపాసకులు శ్యాంరావు, పాండుజీ, గంగుబాయి, కృపవాణి తదితరులు పాల్గొన్నారు.

డీజే ఏర్పాటుకు అనుమతి లేదు

ఆసిఫాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీజే నిర్వహకులు ఎట్టి పరిస్థితుల్లో వినాయక మండపాల వద్ద గానీ, ఊరేగింపులకు డీజేలు ఏర్పాటు చేయడకూడదన్నారు. గణేశ్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు.

నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

కెరమెరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు శనివారం కెరమెరి మండలంలోని కోఠారి, అంబరావుగూడలలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అంబారావుగూడలో నైని చిన్న రాజం ఇంటి పెరట్లో ఒక గంజాయి మొక్కను గుర్తించి స్వాధీ నం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మధకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య



ఆసిఫాబాద్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహిచారు. జిల్లా కేంద్రంలో రైతులు పొలం పనులు పూర్తి అయిన నేపథ్యంలో ఎడ్లకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయాల వద్దకు తీసుకెళ్లారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఎక్కువగా కనిపించే ఈ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సాయంత్రం అందంగా అలంకరించిన ఎడ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, నాయకులు చరణ్, మల్లేష్, రమేష్, మారుతి, అరిగెల నాగేశ్వర్‌రావు, విశాల్‌లు ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. కుమరం భీం చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీచౌక్ వద్ద గల అంకమ్మరాజు ఆలయం వరకు సాగింది. అంకమరాజు ఆలయం వద్ద ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు సరస్వతి, నాయకులు వెంకన్న పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ప్రజలు ర్యాలీలో పాల్గొనడం దానిని చూడడానికి ప్రలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. స్థానిక సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం పొలాల అమావాస్య పండగను రైతులు, పట్టణవాసులు ఘనంగా నిర్వహించారు. సిర్పూరు ఎమ్మెల్యే హరీష్ బాబు తన నివాసంలో ఆవుకు పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో శనివారం పొలాల అవావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ఎద్దులతో ప్రదక్షిణ నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పొలాల అమావాస్య పండుగను శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే రైతులు ఎద్దులను శుభ్రంగా కడిగి అలంకరించారు. సాయంత్రం మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద బసవన్నలను ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మాసం ఉపవాసలతో ఉన్న రైతులు సాయత్రం తమ ఇళ్ల వద్ద ఎద్దులకు ప్రత్యేక పూజలు జరిపి ఉపవాసాన్ని విరమించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): పొలాల పండగ ఆనందోత్సవాన్ని కలిగిస్తుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలో పొలాల పం డగ సందర్భంగా టోంకిని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం టోంకిని గ్రామంలో గ్రామంలో ఎద్దులతో శోభాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లావణ్య, సాయి, శంకర్, సత్యనారాయణ, ప్రశాంత్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలాల అమావాస్య పండగను జరుపు కున్నారు. వ్యవసాయ పనుల పూర్తి అయిన తరువాత బసవన్నలను పూజించడం ఈ ప్రాంత అనవాయితీ. మహారాష్ట్ర సంస్కృతిని పోలి ఉన్న పొలాల అమావాస్య పండగను ఈ ప్రాంతంలో ఘనంగా నిర్వహిస్తారు. ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయాల చుట్టు ప్రదక్షిణలు నిర్వహించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పొలాల పండగను వైభవంగా నిర్వహించారు. రైతులు ఎద్దులకు పూజలు నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాల చుట్టు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పొలాల పండగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎద్దులకు పూజలు నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పొలాల పండగను జరుపుకున్నారు. ఎద్దులను సమీప వాగులో, చెరువుల్లో శుభ్రం చేసి రంగులతో అలంకరించారు. అనంతరం సమీపంలో ఆలయాల చుట్టు ప్రదక్షణలు నిర్వహించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



టోంకిని ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



వాంకిడిలో ఆలయం వద్ద ఎద్దులకు పూజలు చేస్తున్న రైతులు



చింతలమానేపల్లిలో బసవన్నలను ఊరేగిస్తున్న రైతులు